క్లుప్తంగా

మైనార్టీల అభివృద్ధికి కృషి

ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు గుల్షన్



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్ రూరల్: మైనార్టీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ముస్లిం స్మశాన వాటిక ప్రహరి నిర్మాణానికి నిధులు కెటాయిస్తామని, శిథిలావస్థకు చేరిన షాదీఖానా మరమ్మతులకు నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారని, కానీ.. ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈద్గా ప్రాంతంలో వజూఖానా పనులను ఉన్నపలంగా నిలిపివేశారని పేర్కొన్నారు. విషయం పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఎండీ.సర్తాజ్ హుస్సేన్, షేక్ రోమన్, ఎండీ.అజర్, ఎండీ ముర్తుజా, షేక్ సోహెల్, సయ్యద్ ముస్తాఫ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలి

రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి



ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రజకసంఘం నాయకులు

పూడూరు: ప్రభుత్వం రజకులకు ప్రకటించిన ఉచిత విద్యుత్‌ను సక్రమంగా అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మన్నేగుడలో రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులకు ఇచ్చిన ఒకే ఒక పథకం ఉచిత కరెంట్ అని, అది అందించడంలో మీనమేశాలు లెక్కించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో రజకులపై విద్యుత్ అధికారులు ఒత్తిడిచేసి బిల్లులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం సత్వరమే స్పందించి పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు పర్చాలని కోరారు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మొగులయ్య, నాయకులు మహేందర్, నర్సింహులు, శీనయ్య, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఠాక్రేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఠాక్రేతో తాండూరు నాయకులు

తాండూరు: తాండూరులో మరోసారి పార్టీని గెలిపించాలని పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే.. తనను కలిసిన నాయకులకు సూచించారు. మాజీ కౌన్సిలర్ చెన్‌మిళ్ల మల్లిఖార్జున్, బస్వరాజ్, సీనియర్ నాయకులు నగేషులు గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఠాక్రేను కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ప్రభుత్వాలను సాగనంపాలి

మర్పల్లి: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. గురువారం మండల పరిధిలోని సిరిపూరం, వీర్లపల్లి, కొత్లాపూర్ గ్రామాలలో నిర్వహించిన పల్లెపల్లెకూ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మైనార్టీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దీన్, కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యాక్షుడు గోపాల్, బీసీసెల్ జిల్లా మాజీ ఉపాధ్యాక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేయండి

ఎంపీపీ అరవింద్‌రావు

పరిగి: గ్రామ పంచాయతీ అభివృద్ధిపై గ్రామస్తుల సమక్షంలో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జీపీ కార్యదర్శులతో జీపీడీపీ 2023–24 యాక్షన్‌ప్లాన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 31న ప్రతి జీపీలో గ్రామ సభ నిర్వహించాలని సూచించారు. జీపీ ఓటర్ల నుంచి 10శాతం వరకు ప్రజలు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఈ మేరకు దండోరా వేయించాలని చెప్పారు. జీపీ, ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ శేషగిరిశర్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వివేక జీవితం స్ఫూర్తిదాయకం

'చిన్న తనంలోనే అపార జ్ఞానాన్ని సొంతం చేసుకున్న మహనీయుడు స్వామి వివేకానంద. యువతరం ముందుకు వస్తే సాధించనిదంటూ ఏమీ లేదని చెప్పిన మహానుభావుడు. వంద మంది యువకులను తనకు అప్పగిస్తే స్వాతంత్రం తెచ్చే బాధ్యత నా భుజస్కంధాలపై వేసుకుంటానంటూ యువత శక్తిని గుర్తించిన వ్యక్తి వివేకానంద' అని పలువురు వక్తలు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు సకలజనులు పూలమాలలు వేసి, నివాళులర్పించి మాట్లాడారు. యువత.. వివేకను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్



పరిగి: వివేకానంద జయంతిలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



నవాబ్‌పేటలో.. ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు



వికారాబాద్‌లో.. ఎమ్మెల్యే ఆనంద్, చైర్‌పర్సన్ మంజుల



పెద్దేముల్‌లో.. ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తదితరులు



కొడంగల్‌లో.. హిందూ వాహిని సభ్యులు



తాండూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ



కొడంగల్ రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



రోడ్డును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

తాండూరు: ముర్షత్ దర్గా రోడ్డు విస్తరణ పనులను త్వరలో పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. గురువారం పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి బస్వన్నకట్ట వరకు ఉన్న రొడ్డును మున్సిపల్ ఏఈతో కలిసి ఆమె పరిశీలించారు. స్థానికులు చైర్‌పర్సన్‌ను కలిసి రోడ్డు పనులను పూర్తి చేయాలని, రంజాన్ సమయంలో ప్రార్థనకు వచ్చే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. దీంతో చైర్‌పర్సన్ స్పందించి నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో మున్సిపాలిటీకి రూ.25 కోట్ల నిధులను తీసుకొచ్చారని తెలిపారు. అప్పట్లో మున్సిపల్ పరిధిలోని ప్రధాన రొడ్లను వేయడం జరిగిందన్నారు. శివాజీ చౌక్ నుంచి బస్వన్నకట్ట రోడ్డు వరకు ఉన్న రోడ్డును ఇంకా విస్తరించాల్సి ఉందన్నారు. మున్సిపపాలిటిలో ఉన్న నిధులను కేటాయించి రోడ్డుపై సెంట్రల్ లైటింగ్‌తో పాటు పలు అభివృద్ధి పనులు చేపడతామని చైర్‌పర్సన్ తెలిపారు. మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, నాయకులు తదితరులున్నారు.

'పది'లో ఫలితాలు మెరుగుండాలి

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వంద శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని మైలార్‌దేవరాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన.. పాఠ్యాంశాలు సక్రమంగా కొనసాగుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అనంతగిరిపల్లి తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు భరత్, నాయకులు సురేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే కీలకం

బంట్వారం: పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. కోట్‌పల్లి మండల ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, మరోసారి అధికారం చేపట్టే విధంగా పని చేయాలంటూ పిలుపునిచ్చారు. టీఆర్‌ఎస్ పార్టీ నేడు బీఆర్‌ఎస్‌గా దేశమంతటా విస్తరిస్తుందని, ఎన్డీఏను గద్దెదించాలంటే.. కేసీఆర్ నాయకత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహేందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థితో పుస్తక పఠనం చేయిస్తున్న ఎమ్మెల్యే

అంధత్వ నివారణకు 'కంటి వెలుగు'

- చూపు మందగించిన వారికోసం మహోన్నత పథకం
- ప్రతి ఒక్కరు కంటిచూపును పరిరక్షించుకోవాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: అంధత్వ నివారణకోసం కంటి వెలుగు అని, ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, కంటి చూపును మెరుగు పరుచుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష ఎమ్మెల్యే మాట్లాడారు. ఈనెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు.. కంటి చూపు మందగించిన వారికోసం చారిత్రాత్మకమైన పథకమన్నారు. మొదటి విడతలో ఎంతో మందికి కంటి చూపు తీసుకువచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో కార్యక్రమ నిర్వహణ ఖర్చులను జీపీ నుంచే భరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవిందర్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రైతు సమన్వయసమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిగి: సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

విజయవంతం చేయాలి: ఎంపీపీ

యాలాల: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా కోరారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ హాలులో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఐసీడీఎస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. మూడు టీంలుగా వైద్య సిబ్బంది ఏర్పడి వారికి కేటాయించిన గ్రామాల్లో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్లతో పాటు కళ్లద్దాలు వైద్యులు పంపిణీ చేస్తారని చెప్పారు. వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీడీఓ పుష్పలీల, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు రూరల్: కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అనితగౌడ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మండలంలో 100 రోజుల పాటు జరిగే కంటి వెలుగుపై.. గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయించి, ప్రజలు తమ కంటి చూపును పరిరక్షించుకునేందుకు దోహదపడాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజుల, వైస్‌ఎంపీపీ స్వరూపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, తహసీల్దార్ నాయుడు, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్లు శివరామకృష్ణ, నిఖిల్, ఎంపీటీసీ, సర్పంచు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఉన్నపళంగా తొలగిస్తే.. కుటుంబ పోషణ ఎలా?
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి

మోమిన్‌పేట: ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన కార్మికులను పర్మినెంటు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ సర్పంచులు విఠల్, ఇబ్రహీం, ప్రతాప్‌రెడ్డితో కలిసి పెన్నార్ కంపెనీ ముందు వంట వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామంటేనే మా భూములను కంపెనీలకు విక్రయించామని, కంపెనీలో విడతల వారీగా పనిచేస్తున్న 70మంది కార్మికులను ఉన్నపళంగా బయటకు పంపించారని అవేదన వ్యక్తంచేశారు. ఇన్నేళ్లుగా పనిచేస్తున్న వారిని బయటకు పంపించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. బయట నుంచి కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించుకొంటూ.. స్థానికులను ఉద్యోగం నుంచి తీసేస్తే.. వారి కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. కంపెనీ యాజమాన్యం వచ్చి మాట్లాడేంత వరకు నిరసన కొనసాగుతుందని మధుసూదన్‌రెడ్డి, కార్మికులు చెప్పారు.



పెన్నార్ కంపెనీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు తదితరులు

యువత సన్మార్గంలో నడవాలి

అనంతగిరి: యువత సన్మార్గంలో పయనించాలని, అందుకు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని వికారాబాద్ యంపీడీఓ సత్తయ్య అన్నారు. ఈ మేరకు వికాస్ కళాశాలలో జరిగిన వివేకా జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివేకనందా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మనదేశం ఎంతోమంది మహనీయులకు పుట్టినిళ్లన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఏకం కావాలి

కుల్కచర్ల: ముదిరాజ్‌లు సంఘటింతగా హక్కుల సాధనకై ముందుకుసాగాలని ఆ సంఘం చౌడాపూర్ మండల సంఘ నాయకులు మల్లేశ్, రమేష్, మాసయ్య అన్నారు. గురువారం విఠలాపూర్ గ్రామంలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో అధిక శాతం ముదిరాజ్‌లు ఉన్నప్పటికీ.. వారికి అందుతున్న సంక్షేమ పథకాలు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. హక్కులసాధనకై ఏకం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెన్నయ్య, యాదగిరి, నర్సింహ, రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషిచేయాలి

కుల్కచర్ల: విద్యావ్యవస్థ ఉన్నతికి ఉపాధ్యాయ సంఘాలు కృషిచేయాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం టెబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్యానాయక్, మండల అధ్యక్షుడు సూర్య, పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు హన్మంతు, చౌడాపూర్ మండల టీజీయూఎస్ అధ్యక్షుడు శశిధర్, కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి, సంఘ నాయకులు రాములు, శంకర్ నాయక్, తావుర్య, ఓంప్రకాష్, దేవుజానాయక్, దాస్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



టీజీయూఎస్ ఉపాధ్యాయ టెబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

నూతన కమిటీ ఎన్నిక

తాండూరు: వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. వాసవీక్లబ్108ఏ కేబినెట్ సంయుక్త కార్యదర్శి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జోన్ చైర్మన్‌గా గౌరిశంకర్, తాండూరు క్లబ్ అధ్యక్షుడిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా వీరేష్, కార్యదర్శిగా గుణవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా రఘురామ్, కోశాధికారిగా వినయ్‌ని నియమించారు.

బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరం

సీఆర్‌పీ చంద్రశేఖర్

పరిగి: బడీడు పిల్లలను పనిలో పెట్టుకున్నా.. పనికి పంపించినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఆర్‌పీ చంద్రశేఖర్ హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని 15వ వార్డులో గురువారం బడి బయట ఉన్న విద్యార్థుల కోసం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, 14 సంవత్సరాలు కలిగిన బాలబాలికలు విద్యనభ్యసించాలన్నారు. బడి బయట ఉన్న విద్యార్థులను బడి చేరిపించే విదంగా సర్వే చేస్తున్నామని, విద్యనభ్యసిస్తే.. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శ్రీశైలం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'బడిబయటి' పిల్లల కోసం వేట

బొంరాస్‌పేట: బడి ఈడు పిల్లలు, బడిమానిన విద్యార్థులు 'బడిబయట' ఉండటం నేరమని, సీఆర్‌పీలు పిల్లల కోసం వేట మొదలు పెట్టారు. మండలంలోని డీప్లానాయక్‌తండా, కాకర్లగండితండాల్లో బడిబయటి పిల్లల గురించి ఆరాతీశారు. తండాకు చెందిన హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయిని విజయలక్ష్మి పొలం వద్ద ఉన్న ఓ విద్యార్థిని గురించి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. బాడిమానిన విద్యార్థులను గుర్తించి, బడిలో చేర్పించారు. ఇందులో ఐఈఆర్‌పీఎస్ వేణుగోపాల్, రాంచరణ్‌బాబు ఉన్నారు.



పరిగి: సర్వే నిర్వహిస్తున్న సీఆర్‌పీలు



యాలాల: ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు



కొడంగల్ రూరల్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసిన ముగ్గులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

సంక్రాంతి ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యాలయాల ప్రాంగణాలు, మైదానాల్లో రంగవల్లులు పరుచుకున్నాయి. ముఖ్యంగా పాఠశాలలు, పలుసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు, యువతులు, మహిళలు పాల్గొని ఇంద్రధనస్సును తలపించేలా అందమైన ముగ్గులు వేసి.. చూపురులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు వేసిన ముగ్గులను నిర్వాహకులు పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరులో వైస్ చైర్‌పర్సన్ దీప

వయోజనుల పట్ల బాధ్యతగా మెలగండి

ఎస్‌ఐ అరవింద్‌కుమార్

యాలాల: తల్లిదండ్రులు, వయోజనుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎస్‌ఐ అరవింద్‌కుమార్ సూచించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి మండలంలోని అగ్గనూరు గ్రామంలో కళజాత బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మ ద్యం తాగి వాహనాలు నడపడం వలన జరిగే నష్టాలను వివరించారు. సైబర్ క్రైం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు నివారించడం, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశానికి లోనై బలవన్మరణాలకు పాల్పడరాదన్నారు.

నిబంధనలు పాటించండి: ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి ఎస్‌ఐ రవిగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, లైసెన్స్, హెల్మెట్, డ్రంక్‌అండ్‌డ్రైవ్, ఇన్సురెన్స్ తదితర అంశాలపై క్షణ్ణంగా పరిశీలించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.